క్లుప్తంగా

పరామర్శ



వీఆర్ఓ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

కంబదూరు: మండలంలోని నూతిమడుగుకు చెందిన వీఆర్ఓ బొమ్మన్న కుమారుడు బోయ అనిల్ ఇటీవల కనగానపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎంపీ తలారి రంగయ్య ఆదివారం నూతిమడుగుకు వెళ్లి బొమ్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలన్నారు. మీ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామిని తాకిన సూర్య కిరణాలు



కళ్యాణదుర్గం: పట్టణంలోని కోట వీధిలో లక్ష్మీ నరసింహ స్వామి మూల విరాట్‌ను ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. ఏటా వైశాఖ మాసంలో నరసింహ స్వామి జయంతికి ముందు రోజు మూల విరాట్‌పై సూర్య కిరణాలు పడటం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7.05 గంటలకు స్వామి మూల విరాట్‌పై సూర్య కిరణాలు పడటంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

కళ్యాణదుర్గం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆశాబేగం సూచించారు. కళ్యాణదుర్గం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ఆదివారం ప్రజలకు, వాహనదారులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ లింక్ ద్వారా ఎలాంటి లావాదేవీలు జరపకుండా జాగ్రత్త పడాలన్నారు. ఏదైనా బ్యాంక్ నుంచి ఫోన్ కాల్స్ వస్తే ఎవ్వరికీ ఎలాంటి పాస్‌వర్డ్‌లు చెప్పకూడదన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు ఈశ్వర్‌రెడ్డి, హరినాథ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం



కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గం: పురపాలక సంఘం పరిధిలోని 33 వార్డుల్లోనూ తాగునీటి సమస్య రానీయకుండా పటిష్ట చర్యలు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.. పట్టణంలోని అన్నీ కాలనీలకు నీటి కొరతన్న మాటే లేకుండా 90 శాతం నీరందేలా కృషి చేస్తున్నామన్నారు. కణేకల్లు పంప్‌హౌస్ నుంచి రాయదుర్గం ఓహెచ్ఆర్‌కు సరఫరా జరిగే ప్రధాన పైప్‌లైన్ వెనువెంటనే మరమ్మతులకు గురికావడంతో కొద్ది రోజులు నీటి సమస్య తలెత్తిందని గుర్తుచేశారు. అవసరం మేరకు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపామన్నారు. త్వరలో ఐదు కొత్త మోటర్లను విప్ కాపు రామచంద్రారెడ్డి చేతులు మీదుగా ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. అలాగే పారిశుధ్య నిర్మూలన, ప్లాస్టిక్ నివారణ కోసం పకడ్బందీగా చర్యలు చేపట్టామన్నారు. సిబ్బంది సక్రమంగా పనిచేయకపోతే ఉన్నతాధికారులకు సరెండర్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఓ ముఖ్య అధికారితో పాటు ఓ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని సరెండర్ చేశామన్నారు.

గాలీవానకు దెబ్బతిన్న పంటలు



గుమ్మఘట్ట: కలుగోడు గ్రామ సమీపంలో నేలవాలిన వరి పంట

బ్రహ్మసముద్రం/గుమ్మఘట్ట/బొమ్మనహాళ్: బ్రహ్మసముద్రం మండలంలో శనివారం రాత్రి కురిసిన గాలీవానకు రైతు రంగన్నకు భారీ నష్టం వాటిల్లింది. మండంలోని గోవిందయ్యదొడ్డి, వేపులపర్తి, చెలిమైపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షానికి పంటలు నేలకొరిగి పూర్తిగా దెబ్బతిన్నాయి. భైరసముద్రం సమీపంలో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలి కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆదివారం విద్యుత్ అధికారులు అప్రమత్తమై మరమ్మతు చేపట్టి కరెంట్ సరఫరా పునరుద్ధరించారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు, నేత్రపల్లి, భూపసముద్రం బేలోడు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి ఐదుగురు రైతుల రెండున్నర ఎకరాల తమలపాకు తోట నేలకూలింది. అలాగే 25 ఎకరాల మొక్కజొన్న, 50 ఎకరాలు వరి పంట దెబ్బతిన్నట్లు ఉద్యానవన, వ్యవసాయాధికారులు దస్తగిరి, నిర్మల్‌కుమార్ తెలిపారు. బొమ్మనహాళ్ మండలంలో శనివారం రాత్రి 9.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

వైభవంగా వాసవీమాత జయంత్యుత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత జయంతి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్యులంతా ఆదివారం వ్యాపార, వాణిజ్య దుకాణాలను బంద్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటలకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యులు పతాక ఆవిష్కరణ చేసి అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వినాయక సర్కిల్‌లోని బసవణ్ణ ఆలయం వద్ద నుంచి వాసవీ మాత ఆలయం వరకూ వాసవీమాత కలశాలను మహిళలు ఊరేగించారు. సాయంత్రం అమ్మవారిని విద్యుద్దీపాలంకరణ, మేళతాళాలతో పురవీధుల్లో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. ఆలయానికి భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ, వాసవీ మహిళా మండలి, వాసవీ సేవాసమితి, అవోపా, వాసవీ వినాయక సేవాసమితి ఏర్పాట్లు చేశారు.



రాయదుర్గంటౌన్: కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

కణేకల్లు: కణేకల్లులో వాసవీ జయంతి వేడుకలను ఆర్యవైశ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి చిత్రపటంతోపాటు పలువురు మహిళలు కలశలతో ఊరేగింపుగా కన్యకాపరమేశ్వరీ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి మంగళారతి, మహా మంగళారతి, పంచామృతాభిషేకం పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు దుకాణాలను స్వచ్ఛందంగా మూసేసి రోజంతా అమ్మవారి సేవలో గడిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చంద్రశేఖర్ గుప్తా, ఆర్కే బద్రీ, రాఘవేంద్రగుప్తా, ఆర్కే సతీష్, జగదీష్, కేఎస్‌జీటీ సత్యనారాయణ, నాగరాజు, బాలు, ఎర్రిస్వామి, చాపిరి సత్యనారాయణ, బండయ్యశెట్టి, పృథ్వీరాజ్, చాపిరి వెంకటేశులు, సప్తగిరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం

విడపనకల్లు: మండలంలోని పెద్ద కొట్టాలపల్లిలో ఆదివారం చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గ్రామస్తులు చౌడేశ్వరి దేవాలయంలో పూజలు నిర్వహించారు. జ్యోతుల ఉత్సం గ్రామంలో ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించడం ఆనవాయితి. అయితే గతంలో కరోనా కారణంగా ఉత్సవం నిలిచిపోవడంతో.. 11 వ సంవత్సరం జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచు మోదుపల్లి రామాంజనేయులు, వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీతరాణి, నాయకులు ధనుంజ, మోదుపల్లిబాబు పాల్గొన్నారు.

ఘనంగా కలశ ప్రతిష్ట

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో సోమనాథేశ్వరస్వామి, వీరభద్రేశ్వరస్వామి ఆలయాల్లో నూతనంగా నిర్మించిన గోపురాలకు కలశ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో ఆదివారం వేకువజామున సోమనాథేశ్వరస్వామికి, వీరభద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి ఆలయ గోపురాలపై కలశాలను ప్రతిష్టించారు. ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు విప్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్: పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి



కణేకల్లు: పూజలందుకున్న వాసవీమాత



విడపనకల్లు: పెద్ద కొట్టాలపల్లిలో చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవం

కాశీ విశ్వనాథుడిని సందర్శించుకున్న మంత్రి



కాశీలో కుటుంబ సభ్యులతో మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో వెలసిన కాశీ విశ్వనాథుడిని ఆదివారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్ర ప్రజలతో పాటు కళ్యాణదుర్గం నియోజకవర్గం ప్రజలు సుభిక్షంగా ఉండాలని మంత్రి కాశీనాథుడిని వేడుకున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

కణేకల్లు: అన్ని దానాల కన్న రక్తదానం మిన్న అని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఎంసీ మెంబర్ హనుమంతరావు అన్నారు. వాసవీ జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్యులు ఆదివారం జిల్లారెడ్‌క్రాస్ సొసైటీకి రక్తదానం చేశారు. పెద్దలు, యువకులు 33 మంది రక్తదానమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖరగుప్తా, ఆర్కే బద్రీ, సతీష్, రాఘవేంద్రగుప్తా, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు సాయి, అనిల్, వరుణ్, వినయ్, చిన్న, వరప్రసాద్, శ్రీధర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

కణేకల్లు: కణేకల్లులో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ట్రాక్టర్‌లో స్వామి చిత్రపటాన్ని కొత్త కొట్టాల నుంచి బస్టాండ్ వరకూ భక్తులు ఊరేగించారు. స్వామి నామాన్ని స్మరించుకుటూ భక్తిగీతాలు ఆలపిస్తూ ఊరేగింపు చేపట్టారు.

బెళుగుప్ప: స్థానిక విరుపాక్షేశ్వరస్వామి ఆశ్రమంలోని పోతులూరి వీరబ్రహ్మం ఆలయంలో ఆదివారం ఆరాధనోత్సవ పూజలను ఘనంగా ప్రారంభించారు. ఆశ్రమ పీఠాధిపతి ఈశ్వరస్వామి బ్రహ్మంగారి మూలవిరాట్, శివలింగం, పోలేరమ్మ తల్లి విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకాలు, పుష్పార్చన పూజలను నిర్వహించారు. అనంతరం స్వామికి భక్తులు పల్లకీసేవ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వీరబ్రహేంద్రస్వామి, గోవిందమ్మ అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహాలకు పూజలతో బ్రహ్మంగారి రథోత్సవం నిర్వహించనున్నారు.



కణేకల్లు: వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యా యి. అనంతరం అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సోమవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు రాతిదూలం లాగుడు పోటీలు

బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకుని గూళ్యపాళ్యం గ్రామంలో సోమరం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనుట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.8 వేలు, నాల్గవ బహుమతి రూ.5 వేలు, ఐదో బహుమతి రూ.3 వేలు అందజేస్తామన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: పట్టణంలోని పాత పోలీసుస్టేషన్ నుంచి దిగువవీధి వరకు రూ.50లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన సిమెంటు రోడ్డు పనులకు ఆదివారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన జేసీబీ ఆపరేట్ చేసి రోడ్డు లెవెల్ పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పాత పోలీసుస్టేషన్ నుంచి దిగువవీధి వరకూ పట్టణంలోని ప్రధాన రహదారి చాలా అధ్వానంగా ఉండేదని, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్డు బాగు చేయించాలని ప్రజలు కోరడంతో వెంటనే స్పందించి రూ.50 లక్షలు మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.పద్మావతి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, కణేకల్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, ఎంపీటీసీ వన్నూరుషా, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, స్థానిక నాయకులు డాక్టర్ సోమన్న, క్రిష్ణారెడ్డి, లోకేష, సర్మస్, కుండ హనుమంతరావు, లోకేష్, అంబాపురం భాస్కర్‌రెడ్డి, సొల్లాపురం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని వి.కొత్తకోట గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లుకు ఆదివారం ఎంపీటీసీ కాక తిమ్మరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దాసనూర్ సుధాకర్‌రెడ్డి, హనుమంతు యాదవ్, సింగాడి వీరప్ప అధ్వర్యంలో భూమి పూజ చేశారు. క్యాక్రమంలో వైఎస్సాసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బైక్ ర్యాలీ జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో జరిగే బృహత్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఉత్సవ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, రాజేష్ తెలిపారు. రాబోయే రోజుల్లో వినాయక ఉత్సవాన్ని వైభవంగా జరపాలనే సంకల్పంతో ప్రజలకు అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ చేపట్టామన్నారు. ఆదివారం కుల సంఘాల పెద్దలు, పట్టణ ప్రముఖులు, వినాయక మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించినట్లు వారు తెలిపారు.

రక్తదాన శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

రాయదుర్గం: రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో సోమవారం నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం ఏర్పాట్లను ఆదివారం రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి పరిశీలించారు. రక్తదాతలకు ఇబ్బందులు కలకుండా ప్రత్యేక గది ఏర్పాటు చేసి విశ్రాంతి తీసుకునేలా చర్యలు చేపట్టారు. అనంతరం ఆస్పత్రి, రెడ్‌క్రాస్ సిబ్బందితో సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ఆమె మాట్లాడుతూ పెద్దఎత్తున రక్తదాతలను భాగస్వామ్యం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి శిబిరం నిర్వహణకు కావాల్సిన వసతులు సమకూర్చేలా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కి ఆదేశాలు జారీ చేశారు. పెద్ద ఎత్తున నిర్వహించతలపెట్టిన ఈ మెగా కార్యక్రమంలో యువత ఎక్కువ మంది పాల్గొని విజయవంతం చేయాలని కాపు దంపతులు పిలుపునిచ్చారు.

ఇంటర్‌లో గిరిజన విద్యార్థిని సత్తా

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని కొండల మధ్య కర్ణాటక సరిహద్దులో వెలసిన సిద్దాపురం గిరిగూడెంకు చెందిన పూజాబాయ్ ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటింది. మండల కేంద్రంలోని కస్తుర్బా గురుకుల బాలికల పాఠశాలలో చదువుతూ 911 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. దీంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివారం రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థినికి ఘన సన్మానం చేపట్టి మిఠాయి పంచిపెట్టారు. అనంతరం వారితో కలసి లంబాడ నృత్యం చేశారు. కార్యక్రమంలో తాండా వాసులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



రాయదుర్గంటౌన్: 38 ఏళ్ల తరువాత పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదికగా కలుసుకున్న ఘటన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆవిష్కృతమైంది. 1984–85 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు గెట్‌టుగెదర్ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 150 మంది పూర్వ విద్యార్థులు కలిశారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంచి మార్కులు సాధించిన వారికి ఆర్థికసాయం చేయాలని తీర్మానించారు. ట్రస్ట్ ఏర్పాటు చేసి చేయూత అందిస్తామని పూర్వ విద్యార్థులు గొని శ్రీరామిరెడ్డి, పవన్‌కుమార్, శేఖర్, నాగరాజు, జిలాన్, తిప్పేస్వామి, సోమ నీలకంఠ, విజయపవన్ తదితరులు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

కణేకల్లు: పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్యకొట్టుమిట్టాడుతున్న బోయ లక్ష్మి (25) ఆదివారం ఉదయం బళ్లారి విమ్స్‌లో మృతి చెందింది. కణేకల్లు మండలంలోని బెణికల్లు గ్రామానికి చెందిన రైతు దంపతులు లక్ష్మి (25), ఆనంద్ (30) అప్పుల బాధను భరించలేక గురువారం పత్తిపొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా.. అదే రోజు ఆనంద్ మృతి చెందిన విషయం విదితమే. ఆరోగ్య పరిస్థితి విషమించి బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మి ఆదివారం కన్నుమూసింది. వీరికి ముగ్గురు మగపిల్లలున్నారు. ఆమె మృతదేహాన్ని అక్కడే పోస్టుమార్టం చేయించినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కళ్యాణదుర్గం/రాయదుర్గం టౌన్/బొమ్మనహాళ్: ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళ్యాణదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మే 1న ఉదయం 9.30 గంటల నుంచి 1 గంట వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు నియోజకవర్గంలోని సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్ పాఠశాలలో ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. మే 24 నుంచి జరిగే అడ్వాన్స్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి అందరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు అడ్వాన్స్ పబ్లిక్ ఎగ్జామ్స్ ఫీజును మే 3 లోపు చెల్లించాలని ఆమె సూచించారు. అలాగే రాయదుర్గం, బొమ్మనహాళ్‌లో నిర్వహించేఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు జ్ఞానేశ్వర్, మురళి , ఆంజినేయులు తెలిపారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఉరవకొండ: స్థానిక కరిబసవ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మే 1 నుంచి 30 వరకూ నిర్వహించే ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరాల్లో 8–14 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులు పాల్గొనాలన్నారు. ఉదయం 6.30 నుంచి 7.30 వరకూ, సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకూ బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో శాప్ సహకారంతో శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9704532806 నంబర్‌ను సంప్రదించాలని సంస్థ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు ఖలందర్, మణిప్రసాద్, ఎర్రిస్వామి సూచించారు.

ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావాలి

ఉరవకొండ: కేంద్రంలో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి వామపక్ష పార్టీలతో పాటు ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఉరవకొండలో బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా స్థానిక ఆర్టీసీ డిపో నుంచి సీపీఐ, సీపీఎం, వాటి అనుబంధ కార్మిక విద్యార్థి మహిళా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉరవకొండ సీపీఐ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సీపీఎం నాయకుడు రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో జాఫర్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విదానాలను ప్రశ్నించే పార్టీల గొంతునొక్కుతున్నారని మండిపడ్డారు. జీఓ నెంబర్ ఒకటిని తెచ్చి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నాడన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు రామాంజనేయులు, కార్మిక సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, సీపీఎం నాయకులు బాలరంగయ్య, విరుపాక్షి, కృష్ణమూర్తి, సీపీఐ నాయకులు శివన్న, పార్వతి, నారాయణమ్మ, సుల్తాన్, శ్రీదర్, చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

45 రోజులుగా విధులకు డుమ్మా!

శెట్టూరు: మండలంలోని కనుకూరు సచివాలయ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ చెప్పాపెట్టకుండా విధులకు 45 రోజుల నుంచి గైర్హాజరవుతున్నారు. గత నెల మార్చి 14 నుంచి ఏప్రిల్ 30 వరకూ విధులకు హాజరుకాలేదు. ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం లేకుండా, సెలవు పెట్టకుండా విధులకు డుమ్మాకొట్టారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జ్ ఎంపీఈఓ గంగావతిని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి అనుమతి లేకుండా గైర్హాజరయ్యారని, ఫోన్ ద్వారా సంప్రదించినా సరైన సమాధానం లేదన్నారు. సుమారు 45 రోజులు విధులకు గైర్హాజరు కావడంతో సచివాలయంలోని పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. ఇదే సచివాలయంలో ఓ మహిళ పోలీస్ బదిలీపై వెళ్లగా, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజీనామా చేశారన్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి విధులకు గైర్హాజరవుతుండడంతో పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. వీరు విధుల్లో లేకపోవడంతో సచివాలయ సేవలు ఆలస్యమవుతున్నాయని సర్పంచ్ కావేరి, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని వారు కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలో ఆదివారం ఎంపీపీ కరణం పుష్పావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీంరెడ్డి, సర్పంచు సుశీల సహకారంతో గుంతకల్లు కల్పతా హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీ ఓబుళేసు, స్థానిక నాయకులు ఉమాశంకర్, హేమంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మట్కా..!

- జేబులు ఖాళీ చేసుకుంటున్న ప్రజలు
- నిఘా పెంచిన పోలీసులు

☛ రాయదుర్గం మండలం ఆవులదట్లకు చెందిన ముగ్గురు, బెళుగుప్ప మండలం గుండ్లపల్లి కి చెందిన ఇద్దరు వ్యక్తులు మట్కా రాకెట్ నిర్వహిస్తూ నాలుగు రోజుల క్రితం పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.3.25 లక్షల నగదు, 5 సెల్‌ఫోన్లు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకుని నిందితుల పై కేసులు నమోదు చేశారు.

☛ రాయదుర్గం మండలం టీ వీరాపురం లో అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని మట్కా నిర్వహణ పై పోలీసులు విచారణ చేపట్టారు.

రాయదుర్గం: కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం నియోజకవర్గంలో రాకెట్ మట్కా జడలువిప్పుకుంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా చాపకింద నీరులా విస్తరిస్తోంది. పోలీసుల కళ్లుగప్పి ఆన్‌లైన్ వేదికగా గుట్టుచప్పుడు కాకుండా రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. గతంలోనున్న చీటీల వ్యవహారానికి స్వస్తిచెప్పిన నిర్వాహకులు ఫోన్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో దందా కొనసాగిస్తున్నారు. మట్కా మహమ్మారికి బలైపోతున్న సామాన్య కుటుంబాలు కొన్ని రోడ్డున పడాల్సి వస్తోంది. నిఘా పెంచిన పోలీసులు రాకెట్ గుట్టురట్టు చేసేలా ఉక్కుపాదం మోపారు. ఇటీవల రాయదుర్గం మండలంలోని ఆవులదట్లలో ఐదుగురు మట్కా రాకెట్ గ్యాంగ్ సభ్యులు అరెస్టు కావడంతో మరికొంత మంది నిర్వాహకుల్లో కలకలం మొదలైంది. పట్టుబడ్డ వారి నుంచి భారీగా నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాని ఆధారంగా మరింత కూపీ లాగేలా పోలీసులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం



ఎస్పీ ఆదేశాల మేరకు డివిజన్ వ్యాప్తంగా అసాంఘికశక్తులపై ఉక్కుపాదం మోపాం. రాయదుర్గం మండలం ఆవులదట్లలో మట్కా రాకెట్ గట్టురట్టు చేసేలా పోలీసులు జరిపిన తొలి ఆపరేషన్ సక్సెస్ అయింది. ఆన్‌లైన్ మట్కా నిర్వాహకులపై సాంకేతిక ఆధారంగా నిఘా పెంచాం. ప్రజలు కూడా వాటికి దూరంగా ఉండడం మంచిది.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం



ఆవులదట్లలో పట్టుబడ్డ నగదు, సెల్‌ఫోన్లు, మట్కా చీటీలు (ఫైల్)

వాట్సాప్ లో ..

గతంలో చీటీల ద్వారా మట్కా ఆడేవారు. ఇప్పుడు మట్కా ఏజెంట్లు వాట్సాప్ ద్వారా నెంబర్లు పంపించి అందులో ఓపెన్, బ్రాకెట్ తో పాటు పానావన్, టూ డిజిట్ నెంబర్లు రాసి వాట్సాప్‌లోనే మేసేజ్ పంపిస్తున్నారు. ఫోన్‌లో వివరాలను ఏజెంట్‌కు చెబుతారు. వారికి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా డబ్బులను చెల్లిస్తారు. వచ్చిన నెంబర్‌ను మట్కా ఆడేవారు ఆన్‌లైన్ లో చూసుకోవాల్సి ఉంటుంది. మట్కా లో నెంబర్లు వచ్చిన వారికి ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా వెంటనే చెల్లిస్తారు. ఈ ఆట మాస్ అడ్డాలు, పట్టణంలోని టీ హోటళ్లు, శివారు ప్రాంతాలతో పాటు గుమ్మఘట్ట, డి హీరేహాళ్ మండలాల్లో ఎక్కువైనట్టు తెలుస్తోంది. దీంతో మట్కా దందా పై పోలీసులు నిఘా పెంచారు. సాంకేతిక పరిజ్ఞానంతో రాకెట్ గుట్టును రట్టుచేసేలా ఉక్కుపాదం మోపారు. వారి జాడను గుర్తించి అదుపులోకి తీసునేలా చేసిన తొలి ప్రయత్నం లోనే సఫలమయ్యారు. ఈ ఏడాది లో ఇప్పటి వరకు సుమారు 20 కు పైగా మట్కా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది.